సాక్షి
అనకాపల్లి

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



అదిరన్

ఉత్సాహంగా వైజాగ్ మారథాన్

ఏయూక్యాంపస్: విశాఖ నగర ప్రజల సంకల్పానికి ప్రకృతి సహకరించింది. వారి ఉత్సాహాన్ని చూసి వరుణుడు కరుణ చూపాడు. దీంతో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించిన 'వైజాగ్ మారథాన్ ఆహ్లాదకర వాతావరణంలో ఉత్తేజభరితంగా సాగింది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ, సంధ్య మెరైన్ సంయుక్తంగా **బీచ్‌రోడ్డులో పార్క్** హోటల్ వద్ద నుంచి వైజాగ్ మారథాన్ నిర్వహించాయి. ముం**దుగా 21 కిలోమీటర్ల** పరుగు, తర్వాత 10 కిలోమీటర్ల పరుగు, చివరగా 5, 3 కిలో**మీటర్ల పరుగు ప్రారంభమైం**ది. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ **కార్యక్రమంలో నగరం నలు** మూలల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఐదేళ్ల **పిల్లల నుంచి ఆరు పదులు** దాటిన వృద్ధుల వరకు ఇందులో భాగస్వాములయ్యారు. వలు**వురు విదేశీయులు** సైతం పరుగు పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులు బీచ్‌రోడ్డులో **పరుగులు తీస్తూ** సందడి చేశారు. ఈ సందర్భంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్య**క్షుడు బాలకృ**ష్ణ రాయ్ మాట్లాడుతూ నగరవాసులు వయోబేధం లేకుండా **ఈ** కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంధ్య మెరైన్ డైరెక్టర్ రమేష్, హైదరాబాద్ రన్నర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్ వెచ్చా, యూబీఐ జీఎం షాలినీ మీనన్, అపోలో హాస్పిటల్స్ ప్రతినిధి సీవోవో రామచంద్ర, యంగ్ ఇం**డి**యా ప్రతినిధులు, దివీస్ లేబొరేటరీ జీఎం ప్రద్యుమ్న తది**తరులు** పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా **ప్రతి**నిధులు 10 రూపాయల నాణాలపై అవగాహన కల్పించారు. **వైఎంసీఏ** వద్ద ఏర్పాటు చేసిన పోలీసుల ప్రత్యేక బ్యాండ్ రన్నర్స్‌లో **ఉత్సాహం నింపింది. చివ**రిగా విజేతలకు బహుమతులను అందించారు.











ఉరిమే ఉత్సాహం: పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా వైజాగ్ మారథాన్‌లో పాల్గొన్న నగరవాసులు

న్యూస్‌రీల్

సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల కోలాహలం

నాతవరం: అసలే కార్తీక మాసం.. అందులోనూ చివరి ఆదివారం కావడంతో సరుగుడు జలపాతం వద్ద సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో జలకాలు ఆడేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలు ఆడుతూ కాలక్షేపం చేశారు. అదే విధంగా తాండవ రిజర్వాయరు వద్ద కార్తీక వన సమారాధనలో భాగంగా సందర్శకులు సంహపంక్తి భోజనాలు చేసి అక్కడున్న పార్కులో సరదాగా గడిపారు. సరుగుడు జలపాతానికి, తాండవ రిజర్వాయరుకు వెళ్లే రహదారుల్లో ఆదివారం ఉదయం నుంచి వాహనాల రద్దీ పెరిగింది.

5 వరకు ఇంటర్ పరీక్ష ఫీజు గడువు

యలమంచిలి రూరల్: ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా ఇంటర్ విద్యాధికారి బి.సుజాత తెలిపారు. ఈ మేరకు ఇంటర్ విద్యామండలి కృతిక శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇంటర్ జనరల్, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, గతంలో ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆమె సూచించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేసి ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులంతా వార్షిక పరీక్షల ఫీజు చెల్లించేలా చూడాలని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు ఇదే చివరి అవకాశమన్నారు. మరోసారి ఎలాంటి పొడిగింపు ఉండదని ఆమె స్పష్టం చేశారు.

8న ఆన్‌లైన్ క్రీడా పరీక్ష

మొదటి బహుమతి రూ.10 లక్షలు

అనకాపల్లి: రాష్ట్ర చైతన్య కశ్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న క్రీడా భారతి అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా సాధికారిక సంస్థ అధికారి ఎస్.రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పౌరులు ఎవరైనా ఈ పరీక్షలో పాల్గొనవచ్చన్నారు. ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనేందుకు http//kreedaabharati.org/లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 8వ తేదీ ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ పరీక్ష జరుగుతుందని, పరీక్ష సమయం ఒక్కొక్కరికి 25 నిమిషాలని, మొత్తం 50 ప్రశ్నలు ఉంటాయని చెప్పారు. కంప్యూటర్, లాప్‌టాప్, టాబ్లెట్, మొబైల్ ఫోన్లో పరీక్షలు రాయవచ్చన్నారు. ఈ ఆన్‌లైన్ క్రీడా పరీక్షలో ప్రథమ బహుమతిగా రూ.10 లక్షలు (ఒకరికి), ద్వితీయ బహుమతి రూ.50 వేలు(ఇద్దరికి), తృతీయ బహుమతి రూ.25 వేలు (ఆరుగురికి), నాలుగో బహుమతిగా రూ.11 వేలు (11మందికి) ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9963177814 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రావీణ్యం ఎంత..

ప్రమాణాల మాటేమిటి?

- విద్యార్థుల సామర్థ్యాలకు పరీక్ష పెట్టే 'పరఖ్'
- అతి పెద్ద విద్యా సర్వేకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం
- 3, 6, 9 తరగతుల విద్యార్థుల ప్రావీణ్యం పరిశీలన
- జిల్లాలో 82 పాఠశాలల ఎంపిక
- హాజరుకానున్న 2520 విద్యార్థులు
- ఈనెల 4న ఓఎంఆర్ విధానంలో నిర్వహణ



ఆరో తరగతి విద్యార్థులు

యలమంచిలి రూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 4న నిర్వహించే పరఖ్ (పర్ఫార్మెన్స్, అసెస్‌మెంట్, రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్) పరీక్ష కోసం జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 82 పాఠశాలల్లో ఈనెల 4న 94 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌తో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పేరిట చేపట్టిన ఈ సర్వే చివరిసారిగా 2021లో జరిగింది. గత సర్వేలో 3, 5, 8, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి మూడేళ్లకొకసారి నిర్వహించే ఈ సర్వే ఈసారి రాష్ట్రీయ సర్వేక్షణ పరఖ్–2024 పేరుతో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సర్వే రూపకల్పన, తీరుతెన్నులను జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) పర్యవేక్షిస్తోంది. మొత్తం బడుల్లో సగం ప్రభుత్వ, సగం ప్రైవేటు పాఠశాలలు ఉండేలా చూస్తున్నారు.

అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల గుర్తింపు

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను గణించి వాటిని మరింత మెరుగు పరిచేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహిస్తోంది. దీని ద్వారా విద్యాప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో అవగతమవుతాయి. అసెస్‌మెంట్ టెస్ట్‌తో పాటుగా విద్యార్థుల ప్రశ్నావళి, ఉపాధ్యాయుల ప్రశ్నావళి, పాఠశాల ప్రశ్నావళి రూపొందించి వేర్వేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా బీఈడీ, ఎంఈడీ చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేశారు. పరీక్షలో భాగంగా ఆయా పాఠశాలల్లో 30 మంది విద్యార్థులను శాంపిల్‌గా తీసుకుని వారికి అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతి పాఠశాలకు ఎన్‌సీఈఆర్‌టీ నుంచి ఇక సెంట్రల్ అబ్జర్వర్, ఎంపిక చేసిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు వెళ్తారు. పాఠశాల అసెంబ్లీ సమయానికి కంటే ముందుగా పాఠశాలకు వెళ్లి నిర్ణయించిన సమయానికి పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష ఇలా నిర్వహిస్తారు..

తరగతుల వారీగా విద్యార్థులకు భాష, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, పరిసరాల విజ్ఞానంపై ప్రశ్నలుంటాయి. ఈసారి వీటికి అదనంగా విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్), సమస్యలను పరిష్కరించే నేర్పు, విశ్లేషణ నైపుణ్యాలు, భవిష్యత్తులో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యాలపై ప్రశ్నలుంటాయి. విద్యార్థులు ఓఎంఆర్ పత్రంలో జవాబులు గుర్తించాలి.

జిల్లాలో ఇలా..

తరగతి	పాఠశాలలు	విద్యార్థులు
3వ తరగతి	34	720
6వ తరగతి	26	780
9వ తరగతి	34	1020
మొత్తం విద్యార్థులు		2520

పకడ్బందీ ఏర్పాట్లు



జాతీయ ప్రాధాన్యత కలిగిన పరీక్ష పరఖ్. జిల్లాలో ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పరిశీలకులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ పూర్తయింది. విద్యార్థులకు కూడా మూడు మోడల్ ప్రశ్నపత్రాలతో తర్ఫీదునిచ్చాం. వీటిలో ఫలితాల ఆధారంగా విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం.

–గిడ్డి అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

ఎయిడ్స్ రోగులకు ఉచితంగా మందులు

అవగాహనతోనే మహమ్మారి నిర్మూలన • జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బాలాజీ



ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని, సకాలంలో మందులు వాడినట్టయితే సంపూర్ణ జీవితాన్ని పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఎం ఎస్‌వీకే బాలాజీ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి నుంచి నెహ్రూచౌక్ జంక్షన్ వరకూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ర్యాలీ చేపట్టి, రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, పురుషుల నుంచి మహిళలకు హెచ్ఐవీ సోకుతోందని అన్నారు. కొత్తగా నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ మంది బాధితులు 20–30 ఏళ్ల మధ్య వయస్సు వారేనన్నారు. గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి చేసి, పుట్టే బిడ్డకు వ్యాధి సోకకుండా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. పెళ్లికి ముందే హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవడం ద్వారా, జీవిత భాగస్వామికి వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవచ్చునన్నారు.

మందులు సక్రమంగా వాడి సంపూర్ణ ఆరోగ్య జీవితాన్ని పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ వై.శ్రీరామ్మూర్తి, ఏఆర్‌టి మెడికల్ అధికారి ప్రియదర్శిని, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారిణి కనకదుర్గ, ఆస్పత్రి ఏఆర్టీ సిబ్బంది ఆదినాయుడు, ప్రసాద్‌రాజు, రవి, విజయ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లక్ష్మీనాయుడు, గోవింద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైదాన ప్రాంతానికి బదిలీ కోసం..

- ఏజెన్సీకి వెళ్లిన ఉపాధ్యాయుల ఆందోళన పర్వం
- విశాఖలో సమావేశమైన ఉపాధ్యాయులు
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ



గోపాలపట్నం హైస్కూల్లో సమావేశమైన టీచర్లు

విశాఖ విద్య: ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. ఆదివారం గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులంతా సమావేశమయ్యారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 420 మంది ఉపాధ్యాయులను అనివార్యంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు. వీరిలో 50 ఏళ్లకు పైబడినవారు, రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న వారే ఎక్కువగా ఉన్నారు. 200 మందికి పైగా మహిళా ఉపాధ్యాయులు ఉండటంతో వీరంతా తిరిగి మైదాన ప్రాంతాలకు ఎప్పుడు వస్తామా అని ఎదురుచూస్తున్నారు. ఇక తామంతా ఏజెన్సీలోనే ఉండాల్సి వస్తుందేమోననే ఆందోళనతో ఉపాధ్యాయులు పోరుబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన రెండు వందల మంది వరకు ఉపాధ్యాయులు విశాఖలో ఆదివారం సమావేశమయ్యారు. ఏజెన్సీలో మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులు చొప్పున నాయకత్వం వహించేలా, భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల్లో మిగతా వారందరినీ భాగస్వామ్యులను చేసేలా నిర్ణయించారు. త్వరలో చేపట్టబోయే బదిలీల్లో తమకు ప్రాధాన్యం ఇచ్చి, మైదాన ప్రాంతానికి తిరిగి పంపించాలనితీర్మానించారు.

అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపం

అధికారుల నిర్లక్ష్యం ఆ రైతులకు శాపంగా మారింది. సొంత భూములే అయినా క్రయ విక్రయాలు చేసుకోలేక.. ప్రభుత్వ రాయితీలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. రాచపల్లి, జి.కోడూరు రెవెన్యూ పరిధిలో రైతులకు చెందిన 500 ఎకరాల భూములు ఏపీఐఐసీవిగా నమోదు కావడమే దీనికి కారణం. పదేళ్లుగా రైతులను ఈ సమస్య వేధిస్తోంది. ఫలితంగా నిత్యం వారు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- ఆన్‌లైన్‌లో ఏపీఐఐసీ భూములుగా నమోదు
- పొరపాటు సరిదిద్దమని పదేళ్లుగా రైతుల వినతి
- రుణాలు, రాయితీలు అందడంలేదని ఆవేదన
- సొంత భూములైనా.. క్రయవిక్రయాలకు నోచని అన్నదాతలు



ఏపీఐఐసీకి చెందినవిగా చూపుతున్న రాచపల్లి భూములు



రెవెన్యూ సదస్సులో అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)

మాకవరపాలెం: మండలంలో రాచపల్లి ప్రాంతంలో నిర్మించిన అన్‌రాక్ అల్యూమినా శుద్ధి కర్మాగారం కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 2008లో 2200 ఎకరాల భూమిని సేకరించింది. అనంతరం ఈ భూమిని అన్‌రాక్ యాజమాన్యానికి అప్పగించడంతో రిఫైనరీ నిర్మాణం చేసుకుంది. ఏఏ సర్వే నంబర్లలో ఎంతెంత భూమి సేకరించామనే వివరాలతో కూడిన జాబితాలను ఏపీఐఐసీ ఇటు రెవెన్యూ కార్యాలయానికి, అటు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందించింది. అంతవరకూ బాగానే ఉన్నా.. అదే సమయంలో కొందరు రైతుల జీవితాలను తారుమారు చేసే పొరపాటు జరిగింది. మండలంలోని రాచపల్లి, జి.కోడూరు రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీ సేకరించగా మిగిలి ఉన్న సుమారు 500 ఎకరాల భూమిని కూడా ఆ సమయంలోనే అధికారులు పొరపాటున ఏపీఐఐసీవిగా నమోదు చేసేశారు. ఆన్‌లైన్‌లో కూడా ఆమేరకు మార్పులు చేశారు. ఈ విషయం చాలా కాలం రైతులకు తెలీదు. పదేళ్ల క్రితం ప్రభుత్వం రైతుల భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఉన్న వాటికే ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు ఇచ్చేలా ప్రకటించడంతో అధికారుల పొరపాటు బయటపడింది. రైతులు తమ భూములను ఆన్‌లైన్ చేయాలని పాసుపుస్తకాలతో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినప్పుడు తమ భూములు ఏపీఐఐసీ పేరిట ఉన్నట్టు తెలుసుకొని కంగు తిన్నారు. ఈ భూములన్నీ ఏపీఐఐసీవిగా నమోదై ఉన్నాయని, మళ్లీ ఆ భూములను తమవి కాదని తొలగిస్తేనే ఆన్‌లైన్ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో తమ భూములను సర్వే చేసి ఆన్‌లైన్ చేయాలని రైతులు ఆనాటి నుంచీ అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు

ఈ సమస్యను పదేళ్ల క్రితం తెలుసుకున్న రైతులు అప్పటినుంచి రెవెన్యూ అధికారులకు వినతులు ఇవ్వడం ప్రారంభించారు. పలు దఫాలుగా నిర్వహించిన జన్మభూమి, రెవెన్యూ సదస్సుల్లో కూడా రైతులు అధికారులను నిలదీశారు. అంతటితో ఆగక గతంలో పనిచేసిన ఎందరో కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు మీ కోసం, స్పందనలో వినతులు ఇస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటివరకు రైతుల భూములు ఆన్‌లైన్ చేయనేలేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా ఈ భూములు ఏపీఐఐసీవిగా చూపడంతో భూముల క్రయ విక్రయాలు జరగడం లేదని రైతులు వాపోతున్నారు. బ్యాంకు రుణాలు పొందేందుకు, వ్యవసాయ రాయితీలు అందుకునేందుకు కూడా నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తప్పుతోనే సమస్య



అధికారుల తప్పుతోనే మా భూములు ఏపీఐఐసీవిగా నమోదయ్యాయి. నాకు ఎకరా 50 సెంట్ల భూమి ఉంది. దీనిని నా పేరున మార్పు చేసి ఆన్‌లైన్ చేయాలని ఎనిమిదేళ్లుగా దరఖాస్తులు చేస్తున్నాను. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందడం లేదు.

–గల్లా గోవింద, రైతు, జి.కోడూరు, మాకవరపాలెం మండలం

అప్పు చేసి పెళ్లి చేశా...



నాకు రాచపల్లి రెవెన్యూ రెవెన్యూలో 2 ఎకరాల భూమి ఉంది. భూమి అమ్ముకునే అవకాశం లేక అప్పు చేసి నా కుమార్తె వివాహం చేశాను. ప్రస్తుతం వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాను. మా భూములు మా పేరున ఆన్‌లైన్ చేసేందుకు అధికారులు పదేళ్లుగా నరకం చూపిస్తున్నారు.

–రుత్తల శ్రీను, రాచపల్లి, మాకవరపాలెం మండలం



నేటి నుంచి 41 రోజుల మండల దీక్ష

12 నుంచి 32 రోజుల దీక్ష

సింహగిరిపై దీక్షాధారులకు మాలధారణ

జనవరి 12న రెండు దీక్షల ముగింపు





శ్రీనృసింహ దీక్ష.. సర్వ జగద్రక్ష

మహిమాన్వితమైనది శ్రీ నృసింహ దీక్ష



శ్రీ నృసింహ దీక్ష ఎంతో మహిమాన్వితమైనది. శ్రీనృసింహ దీక్షలు దశదిశలా విస్తరించాలని, దీక్షలు తీసుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగాలని పీఠం తరఫున విశేషంగా కృషి చేస్తున్నాం. దీక్షధారుల కోరిక మేరకు 2015 నుంచి దేవస్థానం శ్రీనృసింహ దీక్షలను అధికారికంగా నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది. ఈ ఏడాది మా పీఠం తరఫున ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 1,000 మంది వరకు మండల దీక్ష చేపడుతున్నారు.

– సొనబోయిన రాజు, గురుస్వామి, శ్రీ చందన పెరుమాళ్ పీఠం, సింహాచలం

సింహాచలం: ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షల స్వీకరణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామిని దీక్షలతో కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. తిథులను అనుసరించి దేవస్థానం అధికారులు తేదీలను నిర్ణయించగా.. సోమవారం నుంచి 41 రోజుల మండల దీక్ష, ఈ నెల 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభవుతుంది. ఈ నేపథ్యంలో మండల దీక్ష ఆచరించే భక్తులకు సింహగిరిపై ఉదయం 7 గంటలకు దేవస్థానం వైదికులు మాల ధారణ చేస్తారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షధారులంతా దీక్ష విరమించాల్సి ఉంటుంది.

పోరాట ఫలితంగా..

సింహాచలం దేవస్థానం 2015 నుంచి శ్రీ నృసింహ దీక్షలను అధికారికంగా నిర్వహిస్తోంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దీక్షతో కొలవాలని అడవివరానికి చెందిన కొందరు భక్తులు సుమారు 21 ఏళ్ల కిందట సంకల్పించారు. చందన దీక్షగా నామకరణం చేసి.. ఒక పీఠంగా ఏర్పడి దీక్ష ప్రారంభించారు. అలా ఏడాదికేడాదికి దీక్షాధారులు పెరిగారు. దానికణుగుణంగానే పీఠాల సంఖ్య కూడా పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాలైన ముంచంగిపుట్టు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకు, జి.మాడుగుల, పాడేరు, చెరువుపాకల, పెదగూడ, కుమ్మరిపుట్, చోడవరం, మాడుగుల, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు దీక్ష తీసుకోవడం ప్రారంభించారు. ఒడిశాలోని ఛత్రపూర్, బరంపురం, గోపాలపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, తెలంగాణకు చెందిన పలువురు భక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే చందన దీక్షలను అధికారికంగా నిర్వహించాలని దీక్షాధారులంతా సింహాచలం దేవస్థానం అధికారులను కోరారు. దీనిపై పోరాటం కూడా చేశారు. ఎట్టకేలకు 2015లో చందన దీక్షలను శ్రీనృసింహ దీక్షలుగా నామకరణం చేసి దేవస్థానం అధికారికంగా ప్రారంభించింది. దీక్ష ముగింపు రోజున స్వామికి సమర్పించే ద్రవ్యాల మూటను తిరుముడిగా దేవస్థానం అర్చకులు నామకరణం చేశారు.

పీఠం ఏర్పాటు చేసే విధానం

దీక్షాధారులు స్వయంగా గానీ సామూహికంగా గానీ పవిత్రమైన ప్రదేశంలో పీఠాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక పీటపై విష్వక్సేనుడు, నృసింహస్వామి, లక్ష్మీదేవి, గోదాదేవి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రాతఃకాలంలో స్వామికి సుప్రభాత సేవ నిర్వహించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో విష్వక్సేన ఆరాధన, లక్ష్మీ అష్టోత్తరంతో లక్ష్మీదేవిపూజ, నృసింహ అష్టోత్తరంతో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పూజ చేయాలి. ధనుర్మాసం రోజుల్లో గోదాదేవిని పూజించాలి. పూజానంతరం స్వామి వైభవాన్ని కీర్తించాలి. రాత్రి పవళింపు సేవ నిర్వహించాలి.

పాటించాల్సిన నియమాలు

శ్రీనృసింహ దీక్షను తీసుకునే భక్తులు చందనం రంగు వస్త్రాలు ధరించాలి. నుదుటన తిరునామం ధరించాలి. బ్రహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలి. నది/తటాకం/బావి నీటితో స్నానం చేయాలి. బ్రహ్మచర్యం పాటించాలి.

తిరుముడి ద్రవ్యాలివే..

కొబ్బరి కురిడీలు, చందనం చెక్క, పట్టువస్త్రం, ఆవు నెయ్యి, ముద్ద కర్పూరం, యాలకులు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, కుంకుమ పువ్వు, పచ్చ కర్పూరం, జీడిపప్పు, కిస్‌మిస్, పటిక బెల్లంను తిరుముడిగా కట్టుకుని స్వామికి సమర్పించాలి.



మాలధారణ చేస్తున్న దేవస్థానం వైదికులు(ఫైల్)

మాలధారులకు సాకర్యాలన్నీ కల్పిస్తున్నాం



శ్రీ నృసింహ దీక్షాధారులకు దేవస్థానం తరఫున అన్ని సాకర్యాలు కల్పిస్తున్నాం. ఈ నెల 2, 12 తేదీల్లో దీక్షలు స్వీకరించే వారికి సింహగిరిపైనే మాలధారణ చేస్తాం. తులసిమాల, స్వామి వారి ప్రతిమను దేవస్థానం ఉచితంగా అందిస్తుంది. దీక్ష రోజుల్లో అన్నప్రసాద భవనంలో మధ్యాహ్నం భోజనం అందిస్తాం. ఉచితంగా స్వామి దర్శనం కల్పిస్తాం. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుంది. జనవరి 12న దీక్ష విరమణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం.

–వి.త్రినాథరావు, ఈవో, సింహాచలం దేవస్థానం

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల వెంకటరావు

పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని మాల మహా సభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకటరావు కోరారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయంపై పునరాలోచించాలని, లేకుంటే ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ నెల 8న విశాఖపట్నంలో మాలల గర్జన మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు.14న అమరావతిలో మాల ఐక్య సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. దళిత నాయకుడు పెదపాటి మేఘరంజన్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, చిరుకూరి పేర్రాజు, కవల కుమార్, పల్లా ప్రసాద్, తాటిపాక లోవరాజు, ఐ.ఎస్. మూర్తి, గారా చంటి, బోడపాటి సతీష్, గారా రమేష్, గారా రాజు, ఏనుగుపల్లి శ్రీను, పులి చిట్టిబాబు, బోడపాటి రాంజీ, నెలపర్తి నాగరాజు, సోల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం.. ఆందోళనలో జనం

- జీభత్సం సృష్టిస్తున్న దుస్తుల కర్మాగారం వాహనాలు
- తాజాగా ప్రమాదానికి గురైన మూడు బస్సులు



అచ్యుతాపురం-పూడిమడక రోడ్డులో ప్రమాదానికి గురైన బస్సు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో దుస్తుల కర్మాగారం బస్సుల డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ బీభత్సం సృష్టిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ బస్సుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా లెక్కలేనట్టు డ్రైవర్లు,ట్రావెల్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా శనివారం రాత్రి దుస్తుల కర్మాగారం నుంచి వెళుతున్న మూడు బస్సులు అచ్యుతాపురం–పూడిమడక రోడ్డులో సుప్రజ డెయిరీ సమీపంలో ఒకదానికొకటి వరుసగా ఢీకొన్నాయి. వీటిలో రెండు బస్సులు ధ్వంసమయ్యాయి. బస్సుల అద్దాలు పగిలి ఆ ముక్కలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. గతంలో జరిగిన ప్రమాదాల వల్ల పలువురు మృత్యువాత పడగా, చాలామంది క్షతగాత్రులయ్యారు. పోలీసు అధికారి ఇటీవల సదరు దుస్తుల కర్మాగార బస్సుల డ్రైవర్లు,ఇతర ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. అయినప్పటికీ డ్రైవర్లలో మార్పు రాలేదు. సమీక్ష నిర్వహించిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రమాదం జరిగింది. తరుచూ జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'యూకలిప్టస్ కలప' కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం

- నాతవరం అటవీశాఖ సెక్షన్ అధికారి చిరంజీవి



గాంధీనగరం యూకలిప్టస్ తోటలో నరికి సిద్ధం చేసిన యూకలిప్టస్ కలప

నాతవరం: యూకలిప్టస్ చెట్లు నరికి, కొంత తరలించి, మరికొంత కలప తీసుకెళ్లకుండా ప్లాంటేషన్‌లో వదిలేసిన కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చినట్టు నాతవరం అటవీశాఖ సెక్షన్ అధికారి చిరంజీవి తెలిపారు.మండలంలోని గాంధీనగరం అటవీశాఖ భూమిలో 2001లో వనసంరక్షణ సమితి సభ్యులు సుమారు 40ఎకరాల విస్తీర్ణంలో 3,500పైగా యూకలిప్టస్ మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి భారీ వృక్షాలు కావడంతో వాటిని నరికి కలప తీసుకెళ్లడానికి ఇటీవల అటవీశాఖ అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ యూకలిప్టస్ చెట్లను నరికి 1,700 టన్నులకు పైగా కలప తీసుకెళ్లాడు. మరికొంత కలపను తీసుకెళ్లకుండా వదిలేశాడు. ఆ కలపను కొందరు అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈవిషయాన్ని గాంధీనగరం సర్పంచ్ పాతాళ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వన సంరక్షణ సమితి సభ్యులు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అనధికారికంగా ఒక టేకు చెట్టును నరికారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అటవీశాఖ సెక్షన్ అధికారి చిరంజీవి ఆదివారం ఆ కలపను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూకలిప్టస్ తోట నరికేందుకు టెండరు పాడుకున్న కాంట్రాక్టర్‌కు డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఉందన్నారు. ఈవ్యవధిలో మిగిలి ఉన్న యూకలిప్టస్ చెట్లతో పాటు నరికి సిద్ధం చేసిన కలపను వెంటనే తీసుకెళ్లాలని నోటీసులు ఇచ్చామన్నారు. ప్రతి కలప లోడును విధిగా తూకం వేసి, రశీదు ఇచ్చి పంపుతున్నట్టు చెప్పారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రస్తుతం యూకలిప్టస్ తోటలో నరికేసి ఉన్న కలప వద్ద అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

యూకలిప్టస్ తోటలో ఉన్న టేకు చెట్టును నరికించిన వనసంరక్షణ సమితి చైర్మన్ నూకరాజుపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. యూకలిప్టస్ చెట్లు నరికే కూలీలచే గుట్టుచప్పుడు కాకుండా టేకు చెట్టు నరికి తరలించారన్నారు. క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి దాచిన ఉంచిన టేకు కలపను స్వాధీనం చేసుకుని నర్సీపట్నం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్టు ఆయన తెలిపారు.

దిష్టికోసమని మొక్క కట్టబోతే..

- విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

చోడవరం రూరల్: గౌరీపట్నం గ్రామానికి చెందినకోరుకొండ లక్ష్మి అనే మహిళ ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. అమావాస్య దిష్టి కోసమని కలబంద మొక్కను ఇంటికి కట్టే సమయంలో సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ లైను తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మేడపై నుంచి కిందకు పడిపోయింది. గమనించి చుట్టు పక్కలవారు చోడవరం సామాజిక ఆస్పత్రికి తరలించారు.పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు.మృతురాలి భర్త రెండు సంవత్సరాల క్రితం గ్రామాన్ని అనుకుని ఉన్న పెద్దేరు ఆవలి వైపున ఉన్న పొలాలకు వెళ్లే ప్రయత్నంలో నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించాడు. ఇప్పుడు భార్య లక్ష్మి మృతిచెందడడంతో బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం కాగా, వివాహిత అయిన కుమార్తె గాజువాక సమీపంలోని వడ్లపూడిలో అత్తవారింట ఉన్నారు. కుమారుడు జీవనోపాధి కోసం చెన్నైలో ఉన్నాడు.

కుల ధ్రువ పత్రాలకు పంచనామా నిబంధనలు సడలించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్

దేవరాపల్లి : కుల ధ్రువీకరణ పత్రాలకు పంచనామా తప్పనిసరిగా ఉండాలన్న రెవెన్యూ అధికారులు నిబంధనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల ధ్రువీకరణ పంచనామాకు సర్పంచ్ సహా మరో ఐదుగురు పెద్దల సంతకాలను తప్పనిసరి చేయడంతో విద్యార్థులు, ఉద్యోగార్థులు రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో గిరిజన తెగలు కొండదొర, మన్నెదొర, వాల్మీకి, మూగదొర, నూకదొరతో పాటు మరికొన్ని తెగలకు మాత్రమే సర్పంచ్, గ్రామ పెద్దలు సంతకాలతో కూడిన దరఖాస్తును తహసీల్దార్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి పంపిస్తే కుల ధ్రువ పత్రం మంజూరయ్యేదన్నారు. తాజా నిబంధనలతో ఏ కులానికి చెందిన వారైనా పంచనామాతో పాటు దరఖాస్తుదారుని పాత కుల ధ్రువీకరణ పత్రం ఉంటే తప్ప సచివాలయంలో దరఖాస్తులు తీసుకోవడం లేదన్నారు. ఇదే అదనుగా కొందరు సర్పంచ్‌లు, అధికార పార్టీ నాయకులు తమ అనుయాయులకు మాత్రమే సంతకాలు పెట్టి వారికి నచ్చని వారి పట్ల బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కుల ధ్రువీకరణకు పంచనామ నిబంధనను సడలించాలని వెంకన్న కోరారు.

వంచన బాబుకు వెన్నతో పెట్టిన విద్య

- మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం: ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఇప్పుడు చార్జీలను భారీగా వడ్డిస్తూ ప్రజలకు చంద్రబాబు షాక్ ఇస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రెండు సార్లు ఇప్పటికే రూ.15,485 కోట్లు ప్రజలపై భారం వేశారని చెప్పారు.సర్దుబాటు చార్జీల పేరుతో ప్రతి యూనిట్‌కు అదనంగా 92పైసలను వసూలు చేయడం తగదన్నారు. సంక్రాంతి కానుకగా మరో రూ.9,400 కోట్ల భారం మోపేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఏడాదికి 2వేల కోట్ల చొప్పున 25 సంవత్సరాలలో 50వేల కోట్లు వడ్డించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని చెప్పారు. రాష్ట్రంలో 13 డిస్కంలను అప్పుల ఊబిలోకి నెట్టారని చంద్రబాబుపై ధర్మశ్రీ ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలన్నింటిని విస్మరించారని, ఆరు నెలల్లోనే చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని చెప్పారు. ఇచ్చిన హామీలను అమలుచేయని చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయని, దీంతో ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇచ్చిన హామీలను నెరవేర్చలేని చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు నిజాయితీగా అనేక సంక్షేమ పథకాలను అందించిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారని ధర్మశ్రీ తెలిపారు.

జానకీరాంపురం పీఏసీఎస్‌లో అవినీతిపై విచారణ జరపాలి



రుణం పొందని తాను రుణం ఎలా తీర్చాలంటున్న అప్పల సీతయ్యనాయుడు



తమకు వచ్చిన నోటీసులు చూపుతున్న బాధితులు

రోలుగుంట : జానకీరాంపురం పీఏసీఎస్‌లో తాము రుణాలు తీసుకోకపోయినా, రుణాలు చెల్లించాలంటూ నోటీసులు పంపడంపై పలువురు వాపోతున్నారు. తాము తీసుకోని రుణాలు ఎలా చెలిస్తామంటూ బాధిత కుటుంబాల వారు ఆందోళన చెందుతున్నారు. దీని నిగ్గు తేలాలంటే 51 చట్టం ప్రకారం విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం బాధితులు సమావేశమయ్యారు. వారు విలేకరులతో మాట్లాడుతూ సొసైటీ ఉద్యోగులు కాలపరిమితి అయిపోయిన రుణాలను రికార్డులను తారుమారు చేసి సంఘ సభ్యులకు తెలియకుండా అసలులో రూ.100 కట్టి రుణాలను బతికించి వాటిపై దావాలు వేసి సభ్యులకు జప్తు నోటీసులు పంపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ సొసైటీ పరిధిలో ఏడు పంచాయతీల పరిధిలో సుమారు 300 మందికి జప్తు నోటీసులు పంపించారని, వారిలో అసలు రుణమే తీసుకోని వారు కూడా ఉన్నారని తెలిపారు. ఈ పీఏసీఎస్‌లో సుమారు రూ.2 కోట్లు పైగా రుణాల్లో అవకతవకలు జరిగాయని బాధితులు పచ్చిగోళ్ల ఈశ్వరరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, గొల్లు కల్పన తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ అవకతవకలపై రెండు నెలల క్రితం నర్సీపట్నం డీసీసీబీలో సూపర్‌వైజర్‌ను విచారణాధికారిగా నియమించగా ఆయన ఇక్కడ సొసైటీ ఉద్యోగులతో కుమ్మక్కై సమస్యను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని అన్నారు. గ్రామానికి చెందిన కిల్లాడ సాంబమూర్తి గత ఏడాది కాలంగా నాలుగు దఫాలు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో తమ సమస్యపై ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ కలుగజేసుకొని సంఘ సభ్యుల సమక్షంలో సమగ్ర విచారణ చేపట్టి బాధిత సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామ పెద్దలు సబ్బవరపు పెదియ్యనాయుడు, రమేస్, గోల్లు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా 'ఉక్కు'ను కాపాడుకుందాం

అగనంపూడి: 'అంతా కలిసికట్టుగా విశాఖ ఉక్కును కాపాడుకుందాం. బీఎస్పీ తరఫున దేశ వ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తాం. పార్లమెంట్‌లో గళం వినిపిస్తాం.'అని బీఎస్పీ జాతీయ కో–ఆర్డినేటర్, ఎంపీ రాంజీ గౌతమ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం కూర్మన్నపాలెం కూడలిలో బహుజన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రాంజీ మాట్లాడుతూ 23 ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం అమ్మేసిందని, ఆంధ్రులకు గర్వకారణమైన విశాఖ ఉక్కును నేడు అమ్మకానికి పెట్టిందన్నారు. అదానీ లేదా జిందాల్ చేతుల్లోకి విశాఖ ఉక్కు కర్మాగారం వెళ్లిపోతే బలహీన వర్గాలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలకు భవిష్యత్,జీవనాధారం ఉండదన్నారు. నాలుగులక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్‌ను రూ.25 వేల కోట్లకు అమ్మేస్తే రానున్న రోజుల్లో రిజర్వేషన్లు ఉండవన్నారు. బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్య ఉద్యోగులదనే భావన ప్రజల్లో ఉందని, అలా భావిస్తే ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరగడం ఖాయమన్నారు. స్టీల్‌ప్లాంట్ సమస్య అందరిదని భావించిన నాడే కర్మాగారాన్ని కాపాడుకోగలమన్నారు. ఉత్తరాంధ్రకు వలస నాయకుల వల్లే తీరని నష్టం జరుగుతోందని, ఉత్తరాంధ్రలో బలమైన నాయకులుగా ఉన్న వారు కూడా గొంతెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమై విశాఖ ఉక్కుకు సొంత గనులు లేకుండా చేశాయని ఆరోపించారు. లక్నో నుంచి విశాఖ ఉక్కు కర్మాగారం కాపాడడం కోసం బీఎస్పీ నేతలు ఇక్కడికి వస్తే.. ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు కలిసి రాకపోవడం సిగ్గుచేటన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు సౌమ్యులని, దీన్ని ఆసరాగా తీసుకుని వలస నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడుకోవాలనే సంకల్పంతో బీఎస్పీ ఉందని, పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు బాలయ్య, లకే రాజారావు, ప్రజా సంఘాల నాయకులు వి.వి.రమణమూర్తి, ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, మార్పుపూడి పరదేశి, వరసాల శ్రీనివాసరావు, మాటూరి శ్రీనివాసరావు, జొన్నకూటి విజయ్‌కుమార్, ఓబీసీ నాయకులు పూర్ణచంద్రరావు, రమణ, సత్యనారాయణ, డేవిడ్, గణపతిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- మరో యువకుడికి గాయాలు
- అన్నవరం దేవస్థానానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



మృతిచెందిన ప్రసన్నకుమారి (ఫైల్)



రోదిస్తున్న ప్రసన్నకుమారి తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు

ఎస్.రాయవరం/మునగపాక: ఎస్.రాయవరం మండలం గోకులపాడు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. అనకాపల్లిలోని ఓ ల్యాబ్‌లో పనిచేస్తున్న మునగపాకకు చెందిన బొడ్డేడ ప్రసన్నకుమారి(19), మరో ఐదుగురు స్నేహితులు పిక్నిక్ కోసం మూడు ద్విచక్రవాహనాలపై ఆదివారం ఉదయం అన్నవరం దేవస్థానానికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా గోకులపాడు సమీపంలో బొడ్డేడ ప్రసన్నకుమారి, సంతోష్ అనే యువకుడు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ప్రసన్నకుమారి, సంతోష్‌లను 108 వాహనంలో నక్కపల్లి ప్రభుత్వం ఆస్పత్రి తరలించి, ప్రథమ అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రసన్నకుమారి మృతి చెందినట్టు ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. సంతోష్ ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఆయన చెప్పారు.

మునగపాకలో విషాదఛాయలు

మునగపాక బీసీ కాలనీలో నివాసం ఉంటున్న బొడ్డేడ నాయుడు,లక్ష్మి దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె ప్రసన్నకుమారి ఇంటర్ చదువుకుంది.తండ్రి నాయుడు తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తనతో పాటు ల్యాబ్‌లో పనిచేస్తున్న స్నేహితులతో పిక్నిక్‌కు వెళ్లిన ప్రసన్నకుమారి తిరిగి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో మృతిచెందింది. అందరితో సరదాగా ఉండే ప్రసన్నకుమారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందన్న సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మునగపాకలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ఆదివారం చెప్పారు. రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖకు గంజాయి తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా జిన్నారం మండలం మంగంపేట గ్రామానికి చెందిన మన్నే జగదీష్, అల్లూరు సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం పాత కోట పంచాయతీ బొడ్డపుట్టి గ్రామానికి చెందిన తామర లవకుశలు పట్టుబడినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న శివగణేష్

కశింకోట: స్థానిక నూకాంబిక ఆలయంలో ఆదివారం కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

15న పర్యావరణ అవగాహన కార్యక్రమం

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి గ్రీన్‌వాకర్స్ పేరిట ఉదయం 7 గంటలకు వాకింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అదే రోజు పట్టణంలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నమూనా పరీక్షకు విశేష ఆదరణ



ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

కశింకోట: డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో 'స్పందించే హృదయం' సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) కోసం నిర్వహించే పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన నమూనా పరీక్షకు విశేష ఆదరణ లభించింది. సుమారు 300 మంది విద్యార్థులు వివిధ హైస్కూళ్ల నుంచి పరీక్షకు ఉత్సాహంగా హాజరయ్యారు. వీరి పేపర్లను మూల్యాంకనం చేసి వారిలో ప్రతిభ చూపిన 16 మందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎస్. తమ్మిరాజు మాట్లాడుతూ నమూనా పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, వచ్చే వారం ప్రభుత్వం నిర్వహించనున్న ప్రతిభా పరీక్షను విద్యార్థులు భయం లేకుండా సునాయాసంగా రాయడానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు, ప్రతినిధులు డి. నూకేష్, ఎస్. రమేష్, మల్లేశ్వరరావు, కొణతాల సోమశేఖర్, ఏవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 4 యూనిట్లు, బి పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబి పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 256 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 192 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి పగబట్టింది..
కష్టమే మిగిలింది

- ఫెంగల్ తుపానుతో నష్టపోయిన అన్నదాత
- వరి పంటకు తీవ్ర నష్టం
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు



ఏనుగుతునిలో పడిన పొలాన్ని పైకి లేపి కట్టలు కడుతున్న రైతు



కశింకోటలోని శారదా నది అవతల నీట మునిగిన వరి పొలం



ఏనుగుతునిలో నేలకొరిగిన వరి పైరు

కశింకోట: మండలంలోని వరి రైతులను ఫెంగల్ తుపాను ప్రభావిత వర్షాలు ముంచాయి. వర్షంతో పాటు వీచిన గాలులకు ఆదివారం పలుచోట్ల పండిన పొలాలు నేల రాలిపోయాయి. కొన్ని వర్షపు నీటిలో తడిచి ఉన్నాయి. దీంతో చేతికి అంది వచ్చిన పంట చివరికి నీటిపాలై నష్టం కలిగించిందని రైతులు నిట్టూరుస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 1360 హెక్టార్లలో అత్యధికంగా వరి పంట వేశారు. అది చాలా వరకు పండి చేతికి రానున్న దశలో చేజారిపోయింది. ఫెంగల్ తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా దఫదఫాలుగా వర్షాలు కురిసాయి. శనివారం 11.8 మిల్లీమీటర్లు, ఆదివారం 16.4 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. వర్షం తక్కువే అయినా వీచిన గాలుల ప్రభావంతో పొలాలు ఎక్కువగా నేల కూలాయి. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో కొన్ని పొలాలు నీట మునిగి ఉన్నాయి. కశింకోట, వెదురుపర్తి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, గొబ్బూరు, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, అడ్డాం, చెరకాం, అచ్చెర్ల, బయ్యవరం, జమాదులపాలెం, సోమవరం, ఏఎస్ పేట, ఉగ్గినపాలెం తదితర గ్రామాల్లో పలుచోట్ల పొలాలు నేల కొరిగాయి. కొన్నిచోట్ల వర్షపు నీటిలో మునిగి ఉన్నాయి. పల్లపు ప్రాంతాలైన నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి ప్రాంతాల్లో ఎక్కువగా పొలాలు నేలకొరిగాయి. సుమారు వంద ఎకరాలకు పైగా సాగు నేల కూలినట్లు సమాచారం. మిగిలిన గ్రామాల్లో అడపా దడపా నేలకులాయి. దీంతో ఆరు గాలం కష్టపడి పండించిన పంట నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వర్షాలు పడితే మరింతంగా పొలాలకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇంకా సోమవారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారంతో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే అధికారులు పడిపోయిన పొలాల సంరక్షణకు రైతులు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. పడిపోయిన పొలాలను పైకి లేపి కట్టలుగా కట్టుకోవాలని, మడిలో నీరు లేకుండా తొలగించుకోవాలని, తడిచిన ధాన్యంపై ఉప్పు నీటి ద్రావణాన్ని చల్లాలని సూచిస్తున్నారు. ఎక్కువ రోజులు నీటిలో ఉంటే పొలాలు దెబ్బతినడానికి అవకాశం ఉంటుందని, వర్షాలు తగ్గి ఆరిపోతే నష్ట ప్రభావం తక్కువగా ఉంటుందంటున్నారు.



గొబ్బూరులో నేలకొరిగిన వరి పైరు

ప్రభుత్వం ఆదుకోవాలి..



వేలాది రూపాయలు ఖర్చు చేసి సుమారు రెండు ఎకరాల్లో వేసిన పొలం తుపాను వర్షాలు, గాలులకు నేలకొరిగి నీట మునిగింది. దీంతో ఆరు గాలం కష్టపడి పండించిన పంటకు నష్టం ఏర్పడింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– అల్లం శ్రీను, వరి రైతు, నూతలగుంటపాలెం

పంట నష్టం అంచనాకు చర్యలు..

తుపాను వర్షాలకు పడిపోయిన వరి పొలాలను పైకి లేపి కట్టలుగా కట్టుకోవాలి. మడిలో నీరు లేకుండా తొలగించుకోవాలి. నీటిలో తడిచే ధాన్యంపై ఉప్పు ద్రావణం జల్లుకోవాలి. వర్షాలు తగ్గిన తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా పంట నష్టం అంచనాకు చర్యలు చేపడతాం.

–ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

కశింకోట: కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ఈ సోమవారం నుంచి నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉత్సవాలు స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో వెలసి ఉన్న పురాతన ఆలయంలో నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ఉత్సవ రోజుల్లో అమ్మ వారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5, 12, 19, 26 తేదీల్లో ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు జరగనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసిరావు తెలిపారు. ఈ నెల 25న అమ్మ వారి సారె ఊరేగింపు, మరుసటి రోజు మధ్యాహ్నం దాతలు, భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సన్నాహాలు చేశామని, దాతలు, భక్తులు ఎప్పటిలాగే తమ సహాయ సహకారాలు అందించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వన సమారాధనకు సంఘం సభ్యులు హాజరు కావాలి

అనకాపల్లి: కాపు, తూర్పు కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన వనసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం పట్టణ ప్రతినిధులు యడ్ల గోవింద్, పలకా రాములు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని నాతవరం మండలంలో నల్ల కొండమ్మ ఆలయం, తాండవ రిజర్వాయర్ వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి సభ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మృతుల కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడగా మరో 30 మంది కార్మికులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, మృతుల కుటుంబాలను పరామర్శించడానికి వచ్చిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.40 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి .కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో అచ్యుతాపురం ఎసెన్షియ ఫార్మాలోను, పరవాడ సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదాల్లో మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి స్వయంగా రూ.కోటి నష్టపరిహారం చెల్లించి, క్షతగాత్రులకు తీవ్రతను బట్టి రూ. 50 నుంచి 25 లక్షల వరకు అందజేశారన్నారు. కార్మిక శాఖ మంత్రిగా ఉంటూ కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాల్సింది పోయి ద్రోహం చేసే విధంగా బాధ్యతారాహిత్యంగా ప్రకటన చేసి రూ. 40 లక్షలకే పరిహారాన్ని పరిమితం చేయడం అన్యాయమన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే జరిగిందని రిపోర్టు అందజేశారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. జిల్లా అధికార యంత్రాంగం, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు



నరికేసిన చెట్ల కొమ్మలు

తుమ్మపాల: విద్యుత్ తీగలకు అడ్డంగా ఉండటంతో పచ్చని చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది తొలగించడంతో పట్టణంలో ఎక్కడ చూసినా చెట్లు బోడిగా దర్శనమిస్తున్నాయి. పచ్చదనం పేరుతో విద్యుత్ తీగల కిందే మొక్కలు వేయడంతో అవి పెరిగి పెద్దయ్యే సరికి నేరుగా విద్యుత్ తీగలకు తగలడంతో ఆ చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగిస్తుండటంతో పట్టణంలో అనేక చోట్ల చెట్లు మొండిగా దర్శనమిస్తున్నాయి.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించి ఆదుకోవాలి



భవన నిర్మాణ కార్మికులతో యూనియన్ గౌరవాధ్యక్షుడు భద్రం

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు బకాయి పడ్డ బీమా పరిహారం చెల్లించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం అన్నారు. మండలంలో మామిడిపాలెంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలనలో సంక్షేమ బోర్డును నిలిపివేయడం వల్ల సుమారు 40 వేల డెత్ క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయని, ఆడపిల్లల వివాహ ఖర్చులు, కాన్పు ఖర్చుల కింద ఇచ్చే పరిహారాలు కూడా ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చి నిర్మాణ రంగాన్ని ఆదుకుంటామని వాగ్దానం చేసి 8 నెలలు గడుస్తున్నా మాట నిలబెట్టుకోకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిములు పరిష్కరించి చనిపోయిన కార్మిక కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. లేని పక్షంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మహాలక్ష్మి నాయుడు, సభ్యులు ఎం. కాశప్పారావు, అరిగా అప్పలకొండ, పీలా వెంకట్రావు, చెల్లూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనధికార గ్రావెల్ తవ్వకాలపై చర్యలకు డిమాండ్



గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు చెబుతున్న ఊడేరు కొండ

తుమ్మపాల: మండలంలో ఊడేరు రెవెన్యూ సర్వే నంబర్ 211 కొండను గ్రావెల్ పేరుతో తవ్వేసి కొండను చదును చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాలను అదునుగా చూసుకుని జేసీబీలతో గ్రావెల్ తవ్వకాలు చేసి ట్రక్కులతో బయటికి తరలించేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇటీవల సుమారు ఒక ఎకరానికి పైగా కొండను తవ్వి గ్రావెల్ తీసేయడంతో ఫిర్యాదు చేసినా చర్యలు మాత్రం శూన్యమని గ్రామస్తులు చెబుతున్నారు. కొండను ఆనుకుని సర్వే నెం.33లో కొందరు వ్యక్తులు ప్రైవేటు లేఅవుట్ పేరుతో అభివృద్ధి చేస్తున్న రోడ్లకు కొండపై గ్రావెల్‌ను తరలించారని, లేఅవుట్‌లో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందని, వుడా నిబంధనల ప్రకారం లే అవుట్‌లో పార్కు, ఇతర అవసరాలకు ప్రభుత్వ భూమిని చూపించి అనుమతులు పొందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వుడా, రెవెన్యూ, పంచాయతీ అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మరో రెండు రోజులు తుపాను ప్రభావం



పట్టణ పరిధిలో కురుస్తున్న వర్షం



తుమ్మపాలలో గాలికి నేలకి ఒరిగిన వరి

అనకాపల్లి: ఫెంగల్ తుపాను కారణంగా పట్టణ పరిధిలో ఆదివారం 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ తెలిపారు. మరో రెండు రోజుల పాటు తుపాను ప్రభావం ఉంటుందన్నారు. వరి రైతులు పొలాల్లో వరి కోతను వాయిదా వేసుకోవాలని, గాలికి నేల రాలిన వరిని వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గట్లపై వేసుకోవాలని ఆమె తెలిపారు.

రఘువర్మను గెలిపించుకోవాలని అభ్యర్థన



ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి: రానున్న ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్సీ రఘువర్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కొణతాల గణేష్ అన్నారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ స్థాయి నుంచి ఉపాధ్యాయులను కలుసుకుని మరో సారి రఘువర్మను గెలిపించుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల కార్యదర్శులు వై.శ్రీనివాసరావు, డి.నూకేష్, నోబెల్ టీచర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శులు కృష్ణంరాజు, శ్రీనుబాబు, విశ్రాంత ఎంఈవో బోస్, విశ్రాంత ఎస్‌సీసీ అధికారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల సకాలంలో వేతనాలు చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నాలుగు నెలల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిలో రెండు నెలల బకాయిలు ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శి అంగీకరించారన్నారు. మృతి చెందిన పంచాయతీ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర పెంచాలి



పాడి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర నాయకుడు కర్రి అప్పారావు

కశింకోట: విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను యథావిధిగా పెంచాలని పాల రైతుల సంఘం రాష్ట్ర నాయకుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలోని బయ్యవరం, తాళ్లపాలెం, జోగారావుపేట, నరసింగబిల్లి, తేగాడ తదితర గ్రామాల్లో పాల సంఘాల రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణా జిల్లా పాల డెయిరీలోను, కర్ణాటకలోను పాల ధర పెంచి పాడి రైతులను ప్రోత్సహిస్తుంటే విశాఖ డెయిరీలో మాత్రం తగ్గించడం శోచనీయమన్నారు. డెయిరీని సహకార చట్టం పరిధిలోకి తీసుకు రావాలన్నారు. పాల ధర, ఇతర సమస్యలపై సోమవారం జరగనున్న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమానికి పాడి రైతులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విలువల పరిరక్షణే ధ్యేయంగా సుపథ పరీక్షలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం : రెండు దశాబ్దాలకు పైగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, మానవతా విలువల పరిరక్షణే ధ్యేయంగా సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో సిహెచ్ తలుపులు పేర్కొన్నారు. నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షలకు ఎంఈవో ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సుపథ స్వచ్ఛంద సంస్థ వారు నిర్వహిస్తున్న పోటీ పరీక్షలు విద్యార్థుల్లో విలువలు పెంపొందించేందుకు, మాతృభాషపై మక్కువ పెంచేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. 2003 నుంచి ఈ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. పోటీ పరీక్షలకు 320 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాబి మాస్టర్, ఎం.అప్పలనాయుడు, హరికృష్ణ, సింహాచలం, కామేశ్వరరావు, రామయ్య, నాగరాజు, రామకృష్ణ, పార్వతి, రమణ, పాకలపాడు గురుదేవుల ఆశ్రమ నిర్వాహకులు వై.వి.రమణ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నిర్వహించిన ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలను నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలను బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల ముగింపు సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట శివాజీరాజు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఉప సంహరించుకోవాలి

రోలుగుంట : హామీలు తుంగలో తొక్కి పెంచిన విద్యుత్ చార్జీల నిర్ణయం వెంటనే ఉప సంహరించుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీల అమలులో విఫలం కావడమే కాకుండా కరెంటు చార్జీలు పెంచడం బాధాకరమన్నారు. ప్రజలపై రూ.7,912 కోట్లు భారం పడుతుందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే విద్యుత్ ఛార్జీలు పెంచడం శోచనీయమని, ఇచ్చిన హామీకి కట్టుబడి వెంటనే చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని అన్నారు.